తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

వేతనాలు విడుదల చేయాలి

కన్నాయిగూడెం: ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షురాలు సుమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సుమారు రూ.లక్ష వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బడిబాట పేరుతో సెలవుల్లో ఉపాధ్యాయులతో విధులకు హాజరు కావాలని విద్యాశాఖ నుంచి ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు.







నాలుగు రోజులు నీటి సరఫరా బంద్

- చాలా చోట్ల లీకైన భగీరథ పైపులు
- వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్లు చాలా చోట్ల లీకేజీలు అయి ఫౌంటేన్‌ను తలపిస్తూ నీరంతా బయటకు వస్తుంది. గత నాలుగు రోజులుగా మండలం మొత్తం నీటి సరఫరా నిలిచి పోయింది. స్థానిక రామన్నగూడెం రోడ్డు మహేష్ ఎంటర్ ప్రైజెస్ షాపు ఎదుట ప్రధాన పైపులైన్ పగిలి భారీగా నీరు బయటకు ఎగిసిపడింది. అలాగే చిన్నబోయినపల్లి, చెల్పాక ఇలా ప్రతి చోటా పైపు లైన్లు పగిలిపోయి నీరంతా బయటకు రావడం కనిపించింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన పైపులైన్లు నాణ్యత లేక పగిలిపోతున్నాయి. మిషన్ భగీరథ ప్రధాన గ్రిడ్ ఇంజనీరింగ్ అధికారులు రాంచరణ్, ఇతర అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. నీరంతా వృథాగా పోతుందని పలువురు స్థానికులు సోషల్ మీడియాలో పెడుతున్నా చలనం లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంతో ప్రజాధనం వృథాగా పోతుంది. నీరు బయటకు రావడంతో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన గ్రిడ్ పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గొంతెండుతోంది..

మానసపల్లి, తాళ్లగడ్డం, నందమూరినగర్ ప్రాంతాల్లో ప్రజలకు నాలుగు రోజులుగా నీటి సరఫరా లేక గొంతెండుతుంది. నీటి సరఫరా చేసే ప్రధాన గ్రిడ్‌లైన్ లీకేజీలు, పైపులు పగలడంతో ఎక్కడి నీరు అక్కడే బయటకు పోతుంది. దీంతో నల్లాలకు నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లో నీటిని నింపడం లేదు. దీంతో నల్లాల నుంచి నీరు రాకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. మానసపల్లి ప్రాంత ప్రజలు బకెట్లు, బిందెలు పట్టుకొని తాటు నీటికోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల నీరు ప్రజలకు అందకుండా పోతుంది. ఈ విషయంపై ఏఈఈ రాంచరణ్‌ను వివరణ కోరగా ప్రధాన గ్రిడ్ పైపులైన్ చిన్నబోయినపల్లి వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో పగిలిపోవడంతో మరమ్మతులు చేయించాం. ఏటూరునాగారంలో కూడా రిపేరు చేయిస్తాం. ప్రధాన పైపులైన్ నిర్వాహణపై దృష్టి పెట్టాం.


నీరు లేక దర్శనమిస్తున్న ఖాళీ బకెట్లు


నిరుపయోగంగా మానసపల్లి వాటర్‌ట్యాంక్


పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

ఇబ్బంది పడుతున్నాం



నల్లాల నుంచి నీరు రావడం లేదు. వాటర్ ట్యాంకుకు నీటిసరఫరా కాకపోవడంతో కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితి ఉంది. బయటి నుంచి నీటిని పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నాం. – **నెగరకంటి రమణ, మానసపల్లి**

పరామర్శ

ఎస్‌ఎస్ తాడ్వాయి : మండల కేంద్రం సమీపంలోని కామారం గ్రామానికి చెందిన రేగ నర్సయ్య (86) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగ కాంతారావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రేగ కాంతారావు

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్య


విద్యార్థుల ప్రగతి ఫలితాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మంగపేట : ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్య లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని, శేషారెడ్డి జూనియర్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ప్రగతి ఫలితాలు, ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్ కోసం ఉన్నత ప్రమాణాలు, విలువలతో కూడిన విద్యను అందించడానికి నిత్యం శ్రమిస్తున్నామన్నారు. కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



ఏటూరునాగారం: నెల రోజుల వ్యవధిలోనే తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన సంజీవ ఏప్రిల్ 24న ములుగు కలెక్టరేట్‌కు బదిలీ కాగా వాజేడు తహసీల్దార్ లక్ష్మణ్‌ను ఏటూరునాగారం బదిలీ చేశారు. ఆయన విధుల్లో చేరి నెల రోజుల కాగానే కన్నాయిగూడెం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వీరస్వామిని ఏటూరునాగారం తహసీల్దార్‌గా నియమించారు. ఏటూరునాగారంలో పనిచేసే లక్ష్మణ్ హైదరాబాద్ విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలను స్వీకరించగా సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.











క్రీడలతో మానసికోల్లాసం

ఏటూరునాగారం : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న మాజీ సీబీఐ డైరెక్టర్, మాజీ మంత్రి కాకులమర్రి విజయరామారావు జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు లక్ష్మణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్‌తో స్నేహాన్ని పెంచుకోవాలన్నారు. క్రీడల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. మంగపేట జట్టు 8 ఓవర్లలో 75 పరుగులు చేయగా రైతు రైడర్స్ జట్టు 38 రన్‌లకు ఆలౌట్ అయ్యింది. అత్యంత ప్రతిభ కనబర్చిన హరీష్‌కు లక్ష్మణ్‌బాబు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తాడూరి రఘు, పెండ్యాల ప్రభాకర్, దడిగల సమ్మయ్య, క్రికెట్ మేనేజ్‌మెంట్ సభ్యులు కన్నెబోయిన రాజు, ప్రశాంత్, ఖయ్యూమ్, తదితరులు పాల్గొన్నారు.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న లక్ష్మణ్‌బాబు



ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


విజయభాస్కరావు

ములుగు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి రంగంలో సాధించిన విజయాల ప్రగతిని ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 7న సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ములుగు జిల్లా నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ విజయ భాస్కరరావు తెలిపారు. గురువారం నీటి పారుదల శాఖ ములుగు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 తర్వాత నీటి పారుదల శాఖలో ఎన్నో సంస్కరణలు చోటు చేసుకుని అద్భుత విజయాలను సాధించామని అన్నారు. ములుగు, భూపాలపల్లి, నర్సంపేట మూడు నియోజక వర్గాల పరిధిలో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 7న సాగునీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ములుగు వెంకటాపూర్ రామప్ప సరస్సు వద్ద సాయంత్రం ఐదు గంటల నుంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భూపాలపల్లి జిల్లాలో భీమ్‌ఘనపూర్ చెరువు వద్ద, నర్సంపేటలో వ్యవసాయ శాఖ మార్కెట్ హాల్‌లో సాగునీటి దినోత్సవాలు ని ర్వహిస్తామన్నారు. 8న చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా ములుగు, భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో చెరువుల వద్ద సాయంత్రం ఐదు గంటలకు చెరువుల పండుగ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులను సమీకరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం పల్టీ.. ముగ్గురికి గాయాలు

వాజేడు : ద్విచక్రవాహనం పల్టీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన గురువార చోటు చేసుకుంది. మండల పరిధిలోని పేరూరు సమీపంలోని నల్లవాగు వంతెన సమీపంలో బైక్ పల్టీ కొట్టింది. మోటార్‌సైకిల్ పూర్తిగా రోడ్డు దిగిపోయి పల్టీ కొట్టడంతో దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారిగా తెలిసింది. పూర్తి వివరాలు తెలియ రాలేదు.

ధాన్యం తరలించడంలో అలసత్వం

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించడంలో అధికారుల అలసత్వంతోనే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నైన్‌పాకలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడారు. సెంటర్ వద్ద కనీస సౌకర్యాలు లేక పోవడం సరైంది కాదన్నారు. ఇరవై రోజులు అవుతున్న రైతులు తెచ్చిన ధాన్యం కాంటాలు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యమన్నారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, రఘు, బుగులయ్య, వివేక్, మహేష్, పాల్గొన్నారు.



అధికారులసమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

వెంకటాపురం(కె): తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులతో తహసీల్దార్ నాగరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 23 వరకు జాతీయ ఓటర్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. బూత్‌లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు, గ్రామాల నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని అన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఏటూరునాగారం/వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె), వాజేడు మండలాల్లోని బొల్లారం, నూగూరు అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉన్న గుడుంబా స్థావరాలపై ఏటూరునాగారం ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ పోలీసులు, స్థానిక ఎక్సైజ్ సిబ్బంది కలిసి బెల్లం పానకంతో పాటు గుడుంబాను కూడా ధ్వంసం చేశారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్నట్లు డీటీఎఫ్ ఏఈఎస్ లింగాచారి తెలిపారు. తయారీ దారుల ఆచూకీ కోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, సందీప్, కానిస్టేబుళ్లు నవీన్, తిరుపతి, నాగరాజు, వీరన్న, శ్రీనివాస్, డీటీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

